

# మిథ్యాసత్యం

సాములోరు నదినిండా నీళ్ళుంటాయన్న నమ్మకంతో స్నానానికని బయల్దేరి వచ్చాడు.

ఆగండి సాములూ... ఆగండి... నేను పక్కకి తప్పుకొంటాను..." అని నది ఒడ్డున చేపలు దొరుకుతాయన్న ఆశతో కూర్చున్న ధర్మన్న చెకచెకా బుట్ట సర్దుకుని అవతలికి పరిగెత్త బోయాడు...

సాములోరు ధర్మన్నని ఆపి, "మిత్రమా! నువ్వు తప్పుకొంటావా... నీలో ఉన్న పరమాత్మని తప్పిస్తావా...?" అనడిగాడు.

ధర్మన్నకి ఈ తర్కం బోధపళ్ళేదు.

అప్పుడు సాములోరు ధర్మన్నని దగ్గరకు పిలిచి, భుజం మీద చేతులు వేసి – "ఆ పరమాత్మ నీలోనూ ఉన్నాడు, నాలోనూ ఉన్నాడు... ఇద్దరి పరమాత్మ ఒక్కడే! అందుకని, నాలో పరమాత్మ నడిచొస్తున్నప్పుడు నీలో పరమాత్మ పక్కకు తప్పుకోనవసరం లేదు–" అని ధర్మబోధ చేసాడు.

ధర్మన్న అడిగాడు గదా...

"సాములూ... మనిద్దరి పరమాత్మా ఒక్కడే అయితే, నేను చేపలు పట్టుకు బతుకుతున్నాను – తమరు పురాణాలు చెప్పుకు బతుకుతున్నారు – ఈ తేడా ఏందండీ...?"

సాములు ఏ మాత్రం తడుముకోకుండా, "మిత్రమా! ఆ పరమాత్మ నీరూపంలో చేపలు పడుతున్నాడు. నా రూపంలో పురాణం చెపుతున్నాడు–" అని వివరించాడు.

ధర్మన్న ఒక్కక్షణం ఆలోచించి...

"అంటే, ఆ పరమాత్మ మా ఊరు సర్పంచి రూపంలో గుడి మాన్యాలు దోచుకొంటున్నాడన్న మాట...! అన్నాడు.

ధర్మన్న వ్యాఖ్యానానికి సాములోరు ఖంగు తిన్నారు. "పొరబడుతున్నావు నాయనా! పరమాత్మ తన సొమ్ము తాను దోచుకోవడం ఏమిటీ... "దోపిడీ మిథ్య – ప్రజలు సత్యం" అని సృష్టి రహస్యాన్ని విడమరిచాడు.

ఆ తరువాత సాములోరు స్నానం కోసం మెట్లమీద నుంచి నదిలోకి దిగాడు. పాదాలు కూడా మునగలేదు. ఒళ్ళు తడుపుకుని, స్నానం అయ్యిందనిపించి, బైటకు వచ్చి, "నదిలో బొత్తిగా నీళ్ళే లేవేమయ్యా...?" అన్నాడు.

అప్పుడు ధర్మన్న చెప్పాడు...

"నదికి ఎగువన ఉన్న రాష్ట్రం పరమాత్మ పెద్దప్రాజెక్ట్ కట్టి, నీళ్ళు దాచేసేడండి! దాని కారణంగా "ఈ నది సత్యం – తమరి స్నానం మిథ్య" అయ్యిందండీ...!!

డా॥ జి.వి. పూర్ణచంద్